గాలి వీస్తే కరెంటు బంద్

- ఉక్కపోతతో ప్రజల అవస్థలు
- తరచూ సరఫరాలో అంతరాయం
- పునరుద్ధరణలో అధికారుల నిర్లక్ష్యం



శంషాబాద్ రూరల్: అసలే ఎండాకాలం.. ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇదే సమయంలో చిన్న గాలి వీచినా.. తేలకపాటి జల్లులు కురిసినా చాలు.. కరెంటు సరఫరా నిలిచిపోతోంది.. పునరుద్ధరణకు గంటల సమయం పడుతుండడంతో ఒక్కోసారి రాత్రి వేళల్లో గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. శంషాబాద్, మొయినాబాద్ మండలాల పరిధిలోని గ్రామాల్లో గత కొన్ని నెలలుగా విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేకపోవడం.. సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే సకాలంలో సిబ్బందికి సూచనలు ఇచ్చేవారు లేక సమస్య మరింత జటిలంగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజూ దాదాపు 30 సార్లు కరెంటు సరఫరా నిలిచిపోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల నాటి లైన్లు..

చిన్నగోల్కొండలోని 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి రెండు మండలాలకు కరెంటు సరఫరా అవుతోంది. శంషాబాద్, పెద్దషాపూర్, మల్కారం, నర్కూడ, అమ్డాపూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సబ్ స్టేషన్‌కు సరఫరా అయ్యే కరెంటు లైన్లు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తోంది. పెరుగుతున్న జనాభాతో కరెంటు వినియోగం పెరిగిపోతోంది. లైన్ల ఆధునీకరణ, మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

అంధకారంలో గ్రామాలు..

అంధకారంలో గ్రామాలు..

పెద్దషాపూర్, నర్కూడ, మల్కారం, అమ్డాపూర్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో కరెంటు సరఫరా నిలిచిపోతుండటంతో అంధకారం నెలకొంటోంది. తొండుపల్లి నుంచి నర్కూడ, మల్కారం, అమ్డాపూర్ సబ్‌స్టేషన్లకు సరఫరా అయ్యే 33కేవీ కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడుతున్నాయి. రెండేళ్లుగా ఆయా ప్రాంతాల్లో కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధిక లోడ్ కారణంగా తరచూ సబ్‌స్టేషన్‌ల వద్ద ఇన్సులేటర్లు మొరాయిస్తున్నాయి. ఈ సమయంలో మరమ్మతుల కోసం అధికారులు అందుబాటులో ఉండడంలేదని, దీంతో కరెంటు సరఫరా పునరుద్ధరణకు గంటల సమయం పడుతుందని సిబ్బంది పేర్కొంటున్నారు.

లో ఓల్టేజీ సమస్య తీరేనా..?

కొన్ని గ్రామాల్లో లో ఓల్టేజీ తీవ్ర సమస్యగా మారింది. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం అధికారులు అంచనాలు రూపొందించి, అనుమతులు వచ్చినా.. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదు. అమ్డాపూర్ గ్రామంలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి ఆరు నెలలు గడిచిపోయింది. అయినా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. ఇక్కడ తరచూ లో ఓల్టేజీతో కరెంటు సరఫరా నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కింది స్థాయి సిబ్బందికి ఫోన్ చేస్తే.. మా చేతుల్లో ఏమీ లేదంటూ తప్పించుకుంటున్నారు. ప్రతి అర గంటకు ఓ సారి కరెంటు సరఫరా నిలిచిపోతోంది.

రైతులకు కష్టాలు..

కరెంటు సరఫరా తరచూ నిలిచిపోతుండడం.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితులు నెలకొనడంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. పంటలకు నీరు పెట్టేందుకు బోర్ల వద్దనే కాపలా ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాం..

నర్కూడ పరిధిలో కరెంటు సరఫరా నిలిచిపోతే పరిష్కరించాం.. ఇకపై ఎలాంటి సమస్య రాదు. అంతా బాగానే ఉంది.

– శ్రీనివాసులు, ఏడీఈ, శంషాబాద్.

క్లుప్తంగా...

కరాటేతో ఆత్మరక్షణ



బెల్ట్‌లు, పురస్కారాలను అందజేస్తున్న శివారెడ్డి

మణికొండ: ప్రతి ఒక్కరు కరాటేను నేర్చుకుని ఆత్మరక్షణ చేసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కరాటే పోటీల విజేతలకు బెల్టులు, రూ. వెయ్యి చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు తల్లితండ్రులు తప్పనిసరి కరాటే నేర్పించాలన్నారు. క్రీడాకారులకు అండగా ఉంటూ వారిని ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్‌లు సంజయ్‌కుమార్, మల్లేష్, కృష్ణ, రవిలతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు విశ్వనాథ్, సాంబశివ, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి జ్ఞాపిక అందజేత



అక్బరుద్దీన్ ఒవైసీకి జ్ఞాపిక అందజేస్తున్న సమద్ బిన్ అబ్దాద్

చాంద్రాయణగుట్ట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మజ్లిస్ శాసనసభ పక్ష నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి ఉప్పుగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ సమద్ బిన్ అబ్దాద్‌మక్కా జ్ఞాపిక అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆదివారం బండ్లగూడలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. కార్యక్రమంలో మజ్లిస్ సీనియర్ నాయకులు వర్కల నాగరాజు, పి.బాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



హోం మంత్రిని సన్మానిస్తున్న తిరుపతి నాగరాజు

చాంద్రాయణగుట్ట: రంజాన్ పండుగను పురస్కరించుకుని అలియాబాద్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు తిరుపతి నాగరాజు హోం మంత్రి మహమూద్ అలీకి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన కార్యాలయంలో కలిసి శాలువా కప్పి ఈద్ ముబారక్ తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు రంజాన్ శుభాకాంక్షలు



ఎంపీ అసదుద్దీన్, ఎమ్మెల్యే అహ్మద్ ఖాన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

చార్మినార్: రంజాన్ పండుగ సందర్భంగా మజ్లిస్ పార్టీ అమన్‌నగర్–బీ అధ్యక్షులు మహమ్మద్ మోహీనుద్దీన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆదివారం మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, చార్మినార్ ఎమ్మెల్యే మహ్మద్ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పాతబస్తీ పర్యాటక ప్రాంతాలు కిటకిట



చార్మినార్: వారాంతం కావడంతో ఆదివారం పాతబస్తీలో పర్యాటకులు సందడి చేశారు. చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, లాడ్‌బజార్‌లను సందర్శించడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో పరిసరాల్లో రద్దీ నెలకొంది. నెల రోజుల పాటు కొనసాగిన రంజాన్ మార్కెట్ ముగిసింది. దీంతో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్ తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కిటకిటలాడాయి. చిరువ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి.

భార్యపై భర్త దాడి

గౌలిపురా: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త సుత్తెతో ఆమెపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎ.శివ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బాలాగంజ్ ప్రాంతంలో పద్మజ, వెంకటేశ్వర్ రావు దంపతులు నివాసం ఉంటున్నారు. భార్య పద్మజపై గత కొన్ని రోజులుగా అనుమానం పెంచుకున్న వెంకటేశ్వర్ రావు తరచూ మద్యం సేవించి వచ్చి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున భార్యతో గొడవ పడిన అతను సుత్తె తలపై మోదడంతో పద్మజ తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులలు ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు పద్మజ తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వెంకటేశ్వర్ రావును అరెస్ట్ చేశారు.

శివాంజనేయ స్వామి ఆలయ నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ శివాంజనేయ స్వామి దేవాలయం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ధర్మకర్తల మండలి కాలపరిమితి ముగియడంతో జి.అంజయ్యగౌడ్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సి.హెచ్. చంద్రమౌళిగౌడ్, నరేష్‌గౌడ్, వీరాచారి, దేవేందర్‌గౌడ్, నర్సింహ్మారాజు, వైస్ చైర్మన్‌గా నరేందర్‌గౌడ్, శివచరణ్‌గౌడ్, పి.సత్తయ్యయాదవ్, బి.గోపాల్, ప్రధాన కార్యదర్శిగా పుంజాల నాగరాజుగౌడ్, కార్యదర్శిగా అంజయ్యగౌడ్, అడ్వైజర్‌గా పి.సత్తయ్యయాదవ్, దేవదాస్‌గౌడ్, సభ్యులుగా రాకేష్, నాగరాజుగౌడ్, ఎస్.ఇందిరా, మజ్జిగ అశోక్‌యాదవ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సి.హెచ్.చంద్రమౌళిగౌడ్ మాట్లాడుతూ బుద్వేల్ శివాంజనేయ స్వామి దేవాలయానికి గొప్ప చరిత్ర ఉందన్నారు. కమిటీ సభ్యులు కలిసికట్టుగా దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో పెండ్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ ప్రారంభం



వార్షిక సమావేశాన్ని ప్రారంభించిన ప్రతినిధులు

మణికొండ: దేశ వ్యాప్తంగా ఉన్న వైశ్యులు ఒక నెట్‌వర్క్‌లో చేరి ఉన్నత మార్కెటింగ్ వ్యవస్థతో తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు శివకుమార్ అన్నారు. ఆదివారం గౌలిదొడ్డి శివారులోని ప్రధాన్ కన్వెన్షన్‌లో తమ 4వ చాప్టర్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వైశ్యులు అనేక వ్యాపారాలు చేస్తున్నారని, వాటిని ఓ నెట్‌వర్క్ పరిధిలో చేస్తే వ్యాపారం పెరగటంతో పాటు లాభాలను ఆర్జించవచ్చన్నారు. త్వరలోనే అనేక దేశాల్లో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి వైశ్యులకు తమ సంస్థ అండగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే తమ సంస్థ ఏడేళ్లలో దేశ వ్యాప్తంగా రూ.2100 కోట్ల టర్నోవర్ సాధించిందన్నారు. హైదరాబాద్‌లోని వైశ్యులు తమ సంస్థలో సభ్యులుగా చేరాలన్నారు. ముంబై డబ్బా వాలా ఫేం డాక్టర్ పవన్ అగర్వాల్ నెట్‌వర్క్ వ్యాపారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అభిషేక్ చందా, కోశాధికారి మానేపల్లి మురళీ కృష్ణలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

జెండా పండగను ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తలారి మల్లేష్

మణికొండ: బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 25న మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో పార్టీ జెండాలను ఎగరవేసి ఘనంగా ఉత్సవాలను నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ సమన్వయ కర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ అన్నారు. ఆదివారం ఆయన పార్టీ ముఖ్యనాయకులతో మణికొండలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ జెండా పండగ నిర్వహించిన అనంతరం ప్రతి వార్డు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మైలార్‌దేవ్‌పల్లిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనానికి తరలి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి. శ్రీరాములు, నాయకులు యాలాల నరేష్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది బసవేశ్వరుడు



నివాళులర్పిస్తున్న నాగ్‌నాథ్ మాశెట్టి

చార్మినార్: కుల వ్యవస్థ, వర్ణ విబేధాలు, లింగ వివక్షను వ్యతిరేకించిన గొప్ప మానవతా వాది శ్రీ మహాత్మ బసవేశ్వరుడని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి అన్నారు. శ్రీ మహాత్మ బసవేశ్వరుని 890వ, జయంతోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఆయన తన కార్యాలయంలో మహాత్మా బసవేశ్వరుని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలోని కన్నడిగులు తమ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఇక్కడి ప్రజలతో కలసి మెలిసి జీవనం సాగిస్తున్నారన్నారు. అంటరాని తనాన్ని గట్టిగా వ్యతిరేకించిన బసవేశ్వరుడు వీరశైవ ధర్మ ప్రచారం చేశారన్నారు.

అమిత్‌షా సభకు తరలి వెళ్లిన బీజేపీ నేతలు



విజయ సంకల్ప సభకు వెళుతున్న బీజేపీ నాయకులు

బండ్లగూడ: చేవెళ్లలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదివారం సాయంత్రం జరుగుతున్న విజయ సంకల్ప సభకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ మహాలింగం గౌడ్, మల్లారెడ్డి, శేఖర్ ముదిరాజ్, మహేష్ యాదవ్, నరేష్ యాదవ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరశురామ జయంతి వేడుకలు

అబిడ్స్: శ్రీ పరశురామ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. బేగంబజార్‌లోని రాజస్థాన్ బ్రాహ్మన్ సమాజ్ ఆధ్వర్యంలో పరశురామ పల్లకీ సేవ నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాల పండుగలకు అండగా ఉందన్నారు. ప్రభుత్వమే అన్ని పండుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు.



మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న సంస్థ కార్యవర్గ సభ్యులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, విద్యార్థులను ఆదుకునేందుకు చేపడుతున్న సేవా కార్యక్రమాలను రాబోయే రోజుల్లో మరింత విస్తరిస్తామని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వీఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి. బాపూజీ అన్నారు. ఆదివారం జరిగిన సంస్థ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు మూడు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో చిత్రపురి, 15వ వార్డులో మరో రెండింటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రజల వద్దకే ఆర్‌టీసీ అనే నినాదంతో మణికొండ మీదుగా 47వైఎం నెంబర్‌తో 32 ట్రిప్పులు బస్సులు నడుపుతున్నారని, అధికారులు బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్‌లో నిర్వహించే సమావేశంలో ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి. సీతారాం దాస్, కోశాధికారి దిలీప్ కక్కడ్, సభ్యులు కె.రామకృష్ణారెడ్డి, లక్ష్మన్, విజయలక్ష్మి, ప్రదీప్‌రావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను అందజేస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: పుస్తక పఠనంపై ఆసక్తి ఉన్న వారు జీవితంలో రాణిస్తారని, పుస్తకాలు, దినపత్రికలను చదవటంతో ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలు, ఫర్నిచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీ సంఘాలు గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకుంటే వాటికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్య క్షుడు డి. సీతారాం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోసారం గుట్టను పరిశీలించిన అధికారులు



దేవాలయ భూములను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పోసారం గుట్ట దేవాలయ భూమిలో పక్కనే ఉన్న ఓ బిల్డర్ మట్టి పోస్తున్నారని, దేవాలయ భూమిని కబ్జా చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఆదివారం దేవాదాయ శాఖ అధికారి సత్యచంద్రారెడ్డి గుట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సదరు బిల్డర్ తన భూమిలో కాకుండా దేవాలయ భూమిలో మట్టి పోస్తూ కబ్జాకు యత్నిస్తున్నాడని, దేవాలయానికి చెందిన భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు జెల్లి వెంకటేష్, గోపి మహరాజ్, ఆశన్న, కిషన్, ప్రభు, లక్ష్మన్, శ్రీశైలం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చందనోత్సవం



పూజల్లో పాల్గొన్న గాజుల అంజయ్య, చంద్రకళ దంపతులు

చార్మినార్: స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవ పూజా కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మీరాలంమండి శ్రీ మహాంకాళేశ్వర దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, చంద్రకళ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వేద పండితులు వరప్రసాద్ ఆలయ మర్యాదలతో వారికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం చందనోత్సవ సహిత లక్ష్మీ నరసింహ్మ స్వామి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ కార్యదర్శి కాట రమేష్, ప్రముఖ బిల్డర్ కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో జెండా పండగ నిర్వహించాలి



సమావేశంలో మహ్మద్ సలావుద్దీన్ లోధీ తదితరులు

చార్మినార్: బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 25న నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పార్టీ చార్మినార్ నియోజక వర్గ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఆదివారం పురానీహవేలీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ...జెండా పండుగ అనంతరం ఆజంపురాలోని ఆజం ఫంక్షన్ హాల్‌లో హోం శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ నేతృత్వంలో జరగనున్న సమావేశానికి ర్యాలీగా తరలివెళ్లాలన్నారు. ఇందుకోసం డివిజన్లలో పార్టీ జెండాలను ఏర్పాటు చేసి ర్యాలీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు పుప్పాల రాధాక్రిష్ణ, రవీశ్వర్, మహ్మద్ అమేర్, మనీష్ అగర్వాల్, సయ్యద్ అహ్మద్, నిమ్మగడ్డ రమేష్, సయ్యద్ సలీం, విజయ్‌కుమార్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దూరం..భారం..

- రైల్వే లెవెల్ క్రాసింగ్ మూసివేత
- పాల్మాకుల–పిల్లోనిగూడ మధ్యలో రాకపోకలు బంద్
- సమీప గ్రామస్తుల ఇబ్బందులు
- రెండు నెలలు గడిచినా తెరుచుకోని గేటు



పిల్లోనిగూడ-పాల్మాకుల మధ్యలో మూసివేసిన రైల్వే లెవెల్ క్రాసింగ్

శంషాబాద్ రూరల్: రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను మూసివేసి రెండు నెలలు గడుస్తోంది.. తిరిగి గేటును తెరవకపోవడంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పాల్మాకుల-పిల్లోనిగూడ మధ్యలో రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను 18 ఫిబ్రవరిలో మూసి వేశారు. తిమ్మాపూర్-ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య 20వ లెవెల్ క్రాసింగ్ వద్ద మరమ్మతుల కారణంగా గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ముందస్తుగా సమాచారం అందించారు. 15 రోజుల పాటు గేటు మూసి వేయనున్నట్లు అప్పట్లో పేర్కొన్న అధికారులు రెండు నెలలు గడిచినా తెరవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్రాసింగ్ స్టేషన్ ఏర్పాటు..

పాల్మాకుల-పిల్లోనిగూడ దారి మధ్య 20వ క్రాసింగ్ లెవెల్ సమీపంలో కొత్తగా రైల్వే క్రాసింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీనికితోడు ఉందానగర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ పనులు దాదాపు పూర్తయినప్పటికీ గేటును తిరిగి తెరవకుండా జాప్యం చేస్తుండడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దూర భారంతో తిప్పలు..

పిల్లోనిగూడ, మక్తగూడ, గూడూరు, అచ్చంపేట, ననాజీపూర్, బోటిగూడ, గ్రామాలతో పాటు సమీప గ్రామాల ప్రజలు రోజూ పాల్మాకుల మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారి మధ్యలో ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను మూసి వేయడంతో వారికి దూర భారం తప్పడంలేదు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు తాత్కాలికంగా పట్టా భూముల్లోంచి రైల్వే కల్వర్టు గుండా వెళ్లాల్సి వస్తుంది. అయితే రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేరే మార్గంలో రవాణా సదుపాయాలు లేకపోవడం..దూర భారం పెరగడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

రైల్వే గేటు తెరిపించాలి



పిల్లోనిగూడ నుంచి పాల్మాకుల వెళ్లే మార్గంలో మూసి వేసిన రైల్వే గేటును త్వరగా తిరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే, ఎంపీతో పాటు రైల్వే ఉన్నతాధికారులకు ఈ సమస్యను వివరించినా ఫలితం లేకుండా పోతోంది. పిల్లోనిగూడ నుంచి ప్రత్యామ్నాయంగా రోడ్డు సౌకర్యాలు తగినంతగా లేకపోవడంతో గ్రామస్తులకు కష్టంగా మారింది. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– బుచ్చమ్మ, సర్పంచ్, పిల్లోనిగూడ.